శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

ద్విభాష

సాంస్కృతిక పరిరక్షణకు తారక మంత్రము!

వేపచేదు శ్రీనివాసరావు, పి.హెచ్.డి., జే.డి., ఎల్.ఎల్.ఎమ్.

న్యాయవాది, చికాగో, అమెరికా

ఉపోద్ఘాతము

భాష మన మనుగడకు, సాంఘిక యేర్పాటుకు పూర్తిగా ఆధారభూతమని చెప్పలేము. కానీ, భాష మనకు ఆస్థిత్వము, మతము, సంప్రదాయము, శాస్త్రజ్ఞానము ఇచ్చి, మిగతా జంతుజాలము నుండి మనలను వేరు చేసి గుర్తిస్తుంది. ఈ ప్రపంచములో చాలా రకాలయిన జీవాలు క్లిష్టమయిన సాంఘిక ఏర్పాటు కలిగి ఉన్నాయి. సమస్త జీవజాలానికి ఇతరులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటనికి ఏదో ఒక మాధ్యమము అవసరము. మరి ఆ జీవులన్నీ కూడా ఏదో ఒక మాధ్యమాన్ని భాషకు బదులుగ వాడుతున్నాయి. ఈ మాధ్యమము ఒక రసాయనమే కావచ్చు లేక శబ్దమే కావచ్చు. శబ్దమయితే దాన్ని భాష అని మనమంటాము. అందుకని భాష అనేది మన మనుగడకు చాల ముఖ్యమని చెప్పవచ్చు. భాషే కదా మనకీ మిగత జంతువులకూ, మిగతా జాతులకు తేడా తెలియ చేసేది! అందుకనే భాషను మానవపరిణామములో ఒక ముఖ్యమయిన

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

భాగముగా గుర్తించవచ్చు.

మిగతా జంతువులతో పోల్చి చూస్తే మానవత బాల్యావస్థ లోనే ఉన్నదని చెప్పవచ్చు. ఎందుకంటే మనలో జన్యుపరమయిన వైవిధ్యము చాలా తక్కువ. అందుకనే మానవులంతా ఒకే జాతి (శాస్త్ర భాషలో స్పీషీజ్ –**species**) అని చెప్పవచ్చు. అందుకనే ప్రాచీన బ్రాహ్మణులు మన ప్రపంచాన్ని మొత్తాన్ని ఒక కుటుంబముగా గుర్తించి వసుధైక కుటుంబము అని అన్నారు. అయితే జన్యుపరమయిన భేదమంతగా లేకపోయినప్పటికి, మనలో విపరీతమయిన సాంస్కృతిక పరమయిన వైవిధ్యములు, భేదాలు ఉన్నాయి. ఈ విచిత్రమయిన సాంస్కృతిక నానారూపానికి కారణము భాష. వివిధ మతాలు, కులాలు, సంప్రదాయాలు మనలో ఉన్నాయి. ఇవన్నీ కూడ కొద్దో గొప్పో భాషాపరముగా ఏర్పడిన, భాషపై ఆధారపడిన విషయాలు. మనవాళ్ళు, పరాయివాళ్ళూ అనే విచక్షణ కి మూలము భాషే. ఏ రోజయితే మన భాష నశిస్తుందో ఆ రోజు మన అస్తిత్వము నశిస్తుంది. సాంస్కృతిక వైవిధ్యము లేక పోతే మానవజీవితములో మసాలా ఉండదు, మనకూ పశువుకూ తేడా ఉండదు.

ఇప్పుడు మనకున్న విచక్షణాజ్ఞానాన్ని, ఎన్నో జన్యు పరివర్తనల ద్వారా సాధించాము. ఈ అభివృద్ధిలో ఎంతో క్లిష్టమయిన ఎంపిక ఉంది. ఈ జీవ పరిణామము మూలముగా మనము రెండు–మూడు కోట్ల సంవత్సరాల క్రిందట, కోతులనుండి వేరు పడ్డాము. మనుషులలో ౨౪ (**24**) జన్యువులు చాల వేగంగా మార్పు చెందాయని, ఈ మధ్య "సెల్" అనే పత్రికలో శాస్త్రవేత్తలు చెప్పారు. వీటిలో ౧౭ (**17**) మన మెదడు పెరుగుదలకు కారణమయిన జన్యువులు. ఈ జన్యు మార్పుల మూలంగానే, మన మెదడు మన దగ్గరి బంధువయిన కోతి కంటే కనీసము ౬–౭ (**6- 7**) రెట్లు పెద్దదయింది.

ఒక నాలుగు మిలియను సంవత్సరాల క్రిందట ఇంకొక ముఖ్య పరిణామము మన అభివృద్ధికి కారణమయింది. ఈ పరిణామము జన్యుపరమయిన పరిణామము కాదు. అది సాంస్కృతిక పరిణామము. ఆదేమిటంటే పనిముట్లను తయారుచేయడము ఉపయోగించటము. దీని మూలంగా, మానవాభివృద్ధి, పరిణామము కేవలము జన్యుపరిమితము కాకుండా, సంస్కృతి

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

మీదా కూడా ఆధారపడటము జరిగింది. అంటే మానవపరిణామము ప్రస్తుతము జన్యువుల మీద కంటే సంస్కృతి మీద ఎక్కువగా ఆధారపడి ఉంది అని చెప్పవచ్చు.

మన మెదడు పెరుగుదల తల్లి గర్భంలోకంటే, బయటే ఎక్కువగా జరుగుతుంది. మన జన్యువులు మట్టి ముద్ద అయితే, తల్లిదండ్రులు, సంఘము, కలిసి దాన్ని ఒక వ్యక్తిగా తీర్చిదిద్దుతారు. అందుకనే గ్రామమంతా కలిసి పిల్లల పెంపకములో పాలుపంచుకుంటారు (ఇట్ టేక్స్ విలిజ్ టు రెయిజ చైల్డ్ **"it takes a village to raise a child"**) అని న్యూ యార్కు సెనేటరు క్లింటను హిల్లరి అన్నారు. అంటే మన తల్లిదండ్రులు, సంఘము, సాంఘిక పరిస్థితులు మొదలయిన వాటన్నిటి మీద మన వ్యక్తిత్వము ఆధారపడి ఉంది. సంఘములో వ్యక్తిగతమయిన అభివృద్ధి మన తెలివితేటలు, లౌకికము, మొదలయిన వాటిపై ఆధారపడి ఉంది. ఇవన్నీ కూడ భాష పై అధారపడున్నాయి.

సాంస్కృతిక వైవిధ్యాన్ని కొలవటము చాల కష్టమే, కాని భాష ఒక మంచి కొలమానము. ప్రపంచములో ఎన్నో భాషలు పుట్టాయి, నశించాయి. మెసపొటేమియా నుంచి పదివేల సంత్సరాల క్రిందట ప్రపంచమంతా వ్యాపించిన వ్యవసాయదారులు చాలా భాషలను సమూలంగా నాశనము చేసారు. అందుమూలంగా ప్రస్తుతము ప్రపంచభాషల సంఖ్య చాలా స్వల్పమయిపోయింది. ప్రస్తుతము ప్రపంచములో ఇంచుమించుగా ౬౦౦౦ (**6000**) భాషలున్నాయి. ప్రస్తుత ప్రపంచ జనాభాలో సగము, అంటే సుమారు మూడు శతకోట్ల (౩,౦౦,౦౦,౦౦౦) మంది, పది భాషలు మాత్రమే మాట్లాడుతున్నారు. మిగిలినవారు ౫౯౯౦ (**5990**) భాషలను ఉపయోగిస్తున్నారు. వీటిలో ఒక ౬౦౦ (**600**) భాషలు తలా నూర్గురికంటే తక్కువ జనాభా కలిగి ఉన్నాయి. అంటే ఈ ఆరువందల భాషలు, వాటితోపాటు వాటి పై అధారపడిన సంస్కృతులు, త్వరలో నశించిపోతాయన్నమాట.

భారతదేశ జనాభా లెక్కల ప్రకారము, సుమారు ౧౬౫౨ (**1652**) భాషలు ౧౯౬౧, ౧౯౭౧ (**1961, 1971**)లలో నమోదయ్యాయి. ఈ ౧౬౫౨ (**1652**) భాషల్లో, ౩౩ (**33**) భాషలు

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

తలా కనీసము లక్షమంది జనాభా కలిగి ఉన్నాయి. అయినప్పటికి భారతప్రభుత్వము వీటినన్నిటిని గుర్తించటానికి నిరాకరించింది. ప్రస్తుతము భారతప్రభుత్వము పద్దెనిమిది భాషలను మాత్రమే అధికారిక జాతీయ భాషలుగా గుర్తించింది. లక్షపైన జనాభా కలిగి ఉన్న భాషలనే ప్రభుత్వము గుర్తించకుండ, వాటిని నాశనము చేయటానికి నిశ్చయించినపుడు, మిగిలిన భాషల గతేమిటి? అవన్ని త్వరలో నామరూపాలు లేకుండ పోకతప్పదు. అంతర్జాతీయ సంస్థ, యునైటెడ్ నేషన్స్ ఎన్వైరాన్ మెంటల్ ప్రోగ్రాం, దృష్టిలో ప్రతి భాషా ఒక అపురూపమయిన ప్రాచీన గ్రంధము వంటిది. అంటే భారత ప్రభుత్వము ౧౬౩౬ (**1636**) అపురూపమయిన ప్రాచీన గ్రంధాలని ఆదరించి, పదిలపరచటానికి నిరాకరించింది. అవి త్వరలో కనుమరుగయిపోతాయి.

జీవవైవిధ్యము అనేది ధరణి మనుగడకు చాలా అవసరమని శాస్త్రవేత్తలు గుర్తించారు. అట్లాగే మానవ మనుగడకు సాంస్కృతిక వైవిధ్యము, సాంస్కృతిక వైవిధ్యానికి భాషా వైవిధ్యము చాలా అవసరమని చెప్పవచ్చు. అందుకని దేశీయ భాషల పరిరక్షణ అనేది ప్రతి దేశము, రాజ్యము యొక్క బాధ్యత. ఈ భాషలు కాని, సంస్కృతులు కాని ఏ ఒక్క దేశము యొక్క సొత్తు కాదు. ఇవన్నీ ప్రపంచ మానవ సమాజ ఉమ్మడి ఆస్తి. ఆఫ్ఘనిస్థాన్ లో తాలిబాన్ బుద్ధ విగ్రహాలను నాశనము చేయడము ఎంత పాపమో, భాషల నాశనము కూడ అంతే దుష్కార్యము. అందుకని భాషసంరక్షణ అనేది చాల ముఖ్యమయిన విషయము.

ప్రస్తుతము మనము ఇంకొక ముఖ్యమయిన పరిణామ దశలో ఉన్నాము. దీనిని సాంస్కృతిక నాశనయుగము అని చెప్పవచ్చు. అందుకనే భాషాసాంస్కృతిక పరంగా మనమొక అసాధారణమయిన కాలంలో ఉన్నామని అంటారు బ్రిటీషు భాషావేత్త గ్రడాల్ డేవిడ్. కొన్నివందల సంవత్సరాల అభివృద్ధి తర్వాత, మన భాషలన్ని ఒక క్లిష్టమయిన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి ప్రస్తుతము. త్వరలో మనమొక సరికొత్త భాషాయుగంలోకి అడుగుపెట్టబోతున్నాము.

భాషానష్టకారణాలు

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

ప్రజలు వలసపోవటము అనేది ఆదినుండి ఉన్నప్పటికి, ప్రస్తుతము అది భారీ ఎత్తున జరుగుతున్నది. దీనిమూలంగా సాంస్కృతిక వైవిధ్యము నశించటము తధ్యమని నిపుణులంటున్నారు. ప్రపంచమంతా ఒకే భాష మాట్లాడే స్థితికి త్వరలో రాకపోయినప్పటికి, చాలా భాషలూ వాటిపైన ఆధారపడిన సంస్కృతులు కాలగర్భంలో కలిసిపోవడం తధ్యం.

భారతదేశంలోని ౧౬౫౨ (**1652**) భాషల్లోని సుమారు ౧౬౩౬ (**1636**) భాషలు అన్నీ నశించి, ౧౮ (**18**) కంటే తక్కువ భాషలు మిగిలే అవకాశముంది. భారతదేశము ఏర్పడిన తర్వాత భారత కేంద్ర ప్రభుత్వము, దేశాన్ని ఏకము చేయాలనే సదుద్దేశముతో హిందీ భాషను నేర్పే ప్రయత్నము చేసి, మిగిలిన భాషలకు తక్కువ ప్రాధాన్యతనిచ్చింది. అంతే కాకుండా, ప్రజలు వేరే భాషా రాజ్యాలకి తరలి వలస పోవటానికి, తమ భాషను వదిలిపెట్టటానికి ప్రోత్సాహావకాశములు ఏర్పడ్డాయి. ఈ వలస మూలముగా, హైదరాబాదు వంటి నగరాల్లో, స్థానిక అధికారిక భాషకు విలువలేకుండా పోయింది.

ఈ విధంగా భారతదేశం లోని ౧౬౩౬ (**1636**) భాషలు నాశనమయితే, భారతదేశము–ప్రపంచములోని ౬౦౦౦ (**6000**) భాషలలో దాదాపు ౨౭ శాతము (**27%**) భాషల నాశనానికి బాధ్యురాలవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడ కట్టుకొని భాషల నాశనాన్ని చేపట్టినట్టుగా ఉంది ప్రస్తుత పరిస్థితి.

మన పూర్వీకులకు ప్రపంచములోని ప్రతివస్తువు పూజనీయమయిన విషయము. కాని మనకు– మన మనుగడకు అధారమయిన మాతృభాష మీద కూడ గౌరవము లేకపోవటము విచిత్రము. భాష అనేది కేవలము విషయ సంగ్రహణకు, ప్రసరణకు మాత్రమే పరిమితము కాదు, అధ్యాత్మికావసరాలకి కూడ భాష చాలా అవసరము. ఏ సంస్కృతి యొక్క మనుగడయినప్పటికీ భాష మీద అధారపడి ఉంది. మన మాతృభాష మీద మనకు గౌరవము లేక పోవడము, మన భాష దుస్థితికి ఒక ముఖ్య కారణము.

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

మన భాష, మన సంస్కృతులు– మన మనుగడకూ, అభివృద్ధికీ మూలమైన విషయాలుగా గుర్తించి, వాటి సంరక్షణ తమ బాధ్యతగా ప్రజలు గుర్తించాలి. ఈ భాషాసాంస్కృతిక నాశనయుగమనేది ప్రపంచవ్యాప్తమైన ఉత్పాతముగా, వైపరీత్యముగా ప్రతి ఒక్కళ్ళూ గుర్తించాల్సిన అవసరముంది. ప్రపంచవ్యాప్తమయిన ఈ ఉత్పాతానికి కారణాలలో ముఖ్యమయినవి సామ్రాజ్యవాదము, కమ్యూనిజము, మతవ్యాప్తి, ప్రపంచవ్యాపారము మొదలయిన ప్రపంచవ్యాప్తమయిన శక్తులు. ఈ శక్తివంతమయిన ప్రపంచ వ్యాప్త శక్తులను గుర్తించి, జాగ్రత్త పడవలసిన అవసరము ఎంతయినా ఉంది. అంటే, ఈ శక్తులను గుర్తించి, వాటితో సహజీవనము చేయడము అన్నమాట. ఈ గుర్తింపు తెలుగు ప్రజలలో ఇంకా రాలేదు.

మనమేంచేయాలి?

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని నాయకులూ, ప్రజలూ సరయిన మార్గములో నడవాలి. అయితే ప్రజాతంత్ర పాలన ఉన్న భారతదేశములో, ఈ బాధ్యత ప్రజలపయినే అధికంగా ఉంది. ప్రజలే సరయిన నాయకులను ఎన్నుకొనవలసిన అవసరము, అవకాశము, బాధ్యత ఉన్నాయి. వారి చేతిలోనే కదా వోటు ఉన్నది!

అయితే మరి భాష మనుగడకు, అభివృద్ధికి ఇంకా ఏమిచేయాలి? ఏ భాషయినా చాలా కాలము బతికి ఉండాలంటే కొన్ని పరిస్థితులు, వనరులు సమకూడాలి. వాటిలో ముఖ్యమయినది భూమి. అంటే సంస్కృతి మనుగడకు, ఒక దేశము/రాష్ట్రము అవసరము. ఆందుకనే యూదుల సంస్కృతి సంరక్షణార్థము ఇస్రాయిలు దేశాన్ని తయారుచేయడము జరిగింది. శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగము మూలముగా, తెలుగు వారికి ఒక ప్రత్యేక రాష్ట్రమేర్పడింది. తెలుగు ప్రజలకి పరదేశాలకు, పరాయి రాష్ట్రాలకు జీవనోపాధి కోసము వెళ్ళవలసిన అవసరము, పరాయి భాషలు నేర్చుకొని వారిలో ఇమిడిపోవలసిన అవసరము లేదు. ఆయితే, ఇస్రాయిలు లో హీబ్రు భాషాభివృద్ధి గత యాభయేళ్ళలో జరిగినదానికంటె కనీసము ౧౫–౧౬ (**15-16**) రెట్లు ఎక్కువ

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

ఆంధ్రప్రదేశము లో జరగటానికి అవకాశము, వనరులున్నాయి (వనరులలో జనాభా ఒక ముఖ్యమైన అంశము), కాని జరగలేదు.

ప్రజలు సహజంగా తమ తమ గ్రామాలను, పుట్టిళ్ళను వదిలి వెళ్ళటానికి ఇష్టపడరు. పుట్టిన ఊరిలో ఏ కారణంగా అయినా బ్రతుకు దుర్భరమయితే లేక దేశ బహిష్కారము చేస్తేనే కాని సహజంగా ఎవరూ తమ సొంత ఊరు వదిలి పెట్టటానికి ఇష్టపడరు. ఇది మానవ ప్రకృతి. ఈ తమ కుటుంబాలతో, తమ వాళ్ళతో కలిసి ఉండటమనే ప్రకృతి సహజమయిన తత్వము మూలంగానే, ఈ ప్రపంచములో ఇన్ని తెగలు, ఇంత సాంస్కృతిక వైవిధ్యము ఏర్పడ్డాయి. అందుకనే వేల సంవత్సరాల చరిత్ర ఉన్న భరతఖండములో ప్రపంచములో ఎక్కడాలేని సాంస్కృతిక వైవిధ్యము వర్ధిల్లుతున్నది. ఈ వైవిధ్యాన్ని సంరక్షించవలసిన బాధ్యత అందరిపైన ఉంది. అయితే భాషాసంస్కృతులను రక్షించాలంటే, స్థానికంగా కృషి జరిగితేనే సాధ్యమవుతుంది. అంటే ఉదాహరణకు తెలుగు భాషాసంస్కృతుల అభివృద్ధి కాని, నాశనము కాని ఆంధ్రప్రదేశములోనే సాధ్యమవుతుంది. ఇక్కడే తెలుగు అభివృద్ధి, మనుగడ అవసరము.

తెలుగు వారికి ఒక పెద్ద రాష్ట్రముండటమే కాకుండా, దానిలో మూడు ప్రాంతాలు మూడు ప్రత్యేక తెలుగు భాషలతో, సంస్కృతులతో ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమలు తలా ఒక విలక్షణమయిన తెలుగు భాషని కలిగి ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాలు మూడు రాష్ట్రాలుగా అభివృద్ధి చెందితే, తెలుగు భాష మూడు రకాలుగా అభివృద్ధి చెందటానికి అవకాశము కూడా ఉంది. తెలంగాణా రాష్ట్రము ఇవ్వాళ కాకపోతే రేపయిన తధ్యము. దానివలన తెలుగు భావాభివృద్ధి ఇబ్బడికిముబ్బడి అవుతుంది. హిందీ భాష ఎన్నో రాష్ట్రాలలో అధికార భాష గా వర్ధిల్లుతున్నది. ఆ భాష అభివృద్ధికి బహురాష్ట్ర తోడ్పాటు ఒక ముఖ్య కారణము. తెలుగు కూడ అదే విధంగా, అంతర్రాష్ట్రీయ భాషగా, మూడు రాష్ట్రాల అవసరాలు తీరుస్తూ, అభివృద్ధిచెందుతుంది. మూడు రాజధానుల మధ్య ఉత్తరప్రత్యుత్తరాలకు అధికార భాషగా తెలుగుకు వనరులు పెరుగుతాయి. దీని మూలముగా, తెలుగు ప్రజలకు తమ భాషపై గల న్యూనతాభావము పోయి, గర్వపడే రోజు వస్తుంది.

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

ప్రస్తుతము, ఆంధ్రప్రదేశము మొత్తము ఒక కొత్త భాషను ఆదరిస్తున్నది. ఆ భాష తెంగ్లీషు. ప్రజలు, ప్రభుత్వము ఏ భాషనయితే ఆదరిస్తారో, ఆ భాష దాని సంస్కృతి అభివృద్ధి చెందుతాయి. ఆయితే తెంగ్లీషు భాషే తెలుగు అని చాలమంది తెలుగు వారు వాదిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మనకు తెంగ్లీషు మిగిలి, తెలుగు చచ్చిన భాషల జాబితాలో చేరుతుంది. కొంతకాలము తర్వాత తెలుగు ఇంగ్లీషు నుంచి పుట్టింది అని భాషావేత్తలు ప్రతిపాదించుతారేమో! మరి, తెలుగులో మమ్మి, డాడీ, కర్రి, రైసు మొదలయిన ప్రాథమిక పదాలు, ఒక భాష యొక్క అస్తిత్వానికి ప్రతీకలయిన పదాలు, అన్ని ఇంగ్లీషు పదాలే కాబట్టి, అనాగరికులయిన తెలుగు ప్రజలు బ్రిటిషు వారి పుణ్యమా అని మాటలు నేర్చుకున్నారని వాదించవచ్చు! ఈవ్వాళా రేపూ– ఏ ఇంట్లో అయినా అమ్మ, నాన్న, కూర, అన్నము, అన్న, తమ్ముడు, చెల్లి, అక్క మొదలయిన పదాలు సిగ్గుచేటయిన అనాగరికమయిన విషయాలు కదా మరి! ఈ మూర్ఖత్వాన్ని ఆపలేకపోతే మనకు మిగిలేది తెంగ్లీషు మాత్రమే!

ఈ దిక్కుమాలిన రోగము మనకే కాదు, ప్రపంచములోని మరికొన్ని ఇతర భాషలకు కూడ అప్పుడప్పుడు అంటుకుంటూ ఉంటుంది. ఉదాహరణకి యిద్దిష్, స్పాంగ్లిష్ వంటి సరికొత్త భాషలు ఈ రోగము మూలంగా ఏర్పడినవే. ఆయితే ఈ రోగము వారికి వేరే దేశాలకు తరలి వెళ్ళినప్పుడు, పరిస్థితుల ప్రాబల్యము వలన వచ్చింది. మరి మనకు ఈ రోగము మన ఇంట్లోనే వచ్చింది. వెయ్యి సంవత్సరాల బానిస బతుకు అంటే మాటలా! మన బానిసబుద్ధి మూలంగా ఇట్లాంటి రోగాలు వస్తాయి. అయితే దీన్ని (మానసిక) రోగముగా గుర్తించి మందు వేసుకుంటె బాగుపడే అవకాశముంది. కాని మనకు ఈ రోగము రోగము వచ్చింది అనే విషయం తెలిస్తే కదా గర్వకారణమయింది మందుగురించి. ఆలోచించేది. ముందు మనము ఆ విషయాన్ని గుర్తించాలి.

ఇంకొక ముఖ్య కారణమేమిటంటే, ప్రస్థుతము ప్రపంచము మొత్తానికి ఇంగ్లిషు రాణి.

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

భారతీయులందరికి ఈ విషయము అనుభవపూర్వకముగ తెలుసు. బ్రిటీషు వారి సామ్రాజ్యవాదము, అమెరికా ఆధిపత్యము– ఇంగ్లీషు రాణింపుకు ముఖ్య కారణములు. అమెరికా వంటి దేశాలతో వ్యాపార, శాస్త్ర, సాంకేతిక సంబంధాలు భారతదేశ అభివృద్ధికి, మనుగడకు చాలా అవసరము. మనమే కాదు ప్రపంచములోని శక్తిమంతమయిన దేశాలు కూడ ఇంగ్లీషు కి పెద్ద పీట వేయవలసి ఉంటుంది, ఎర్ర తివాచి పరచవలసి ఉంది. ఇంగ్లీషు ప్రపంచములోకెల్ల శక్తిమంతమయిన దేశ భాషే కాదు, అది ప్రపంచ సాంకేతిక, శాస్త్రీయ, ఆర్థిక, వ్యాపార, న్యాయ భాష. రష్యా, ఫ్రాన్సు వంటి శక్తిమంతమయిన దేశాలు కూడ ఈ విషయాన్ని గ్రహించి, ఇంగ్లీషు కి ప్రాధాన్యతనిస్తున్నారు. ఇంగ్లీషు భాషను తప్పించుకోవటము ఎవ్వరి తరము కాదు. అయితే రష్యా, ఫ్రాన్సు వంటి దేశాలు ఇంగ్లీషు ని
ఉపయోగించుకుంటే, మనము ఇంగ్లీషులోనే మునిగి తేలుతున్నాము, అదేదో గొప్పనుకొని! ఇంగ్లీషుని ఒక 'పనిముట్టుగా' ఉపయోగించవలిసింది పోయి, దానినే మన సంస్కృతిగా గుర్తించే స్థితికి మనము దిగజారాము. పై సమకాలీన పరిస్థితితో మన బానిసబుద్ధి కలిసి తెలుగు భాష నాశనానికి నాంది పలుకుతున్నాయి.

న్యాయవాదులు, వైద్యులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ఆర్థికవేత్తలు మొదలయినవారందరు ఇంగ్లీషు ఉపయోగించకుండ, తెలుగులో కార్యక్రమాలు నిర్వహించే స్థితిలో లేరు. ఆందుకని తెలుగు ప్రజలకు తమ భాష పై చులకన. ఆమెరికాలో, స్పానిషు ఏవిధంగా వలసవచ్చిన లటీనో నిమ్నవర్గాలకు పరిమితమయి ఉందో, అలాగే తెలుగు భాష తెలుగు దేశంలో నిమ్న వర్గాల వారికి చదువురాని వారికోసమనే అభిప్రాయము ప్రబలుతున్నది. అందుకనే– ఇవ్వాళ రేపటి తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత స్థితికి చేరాలని ఇంగ్లీషుని ఉగ్గుపాలతో నూరిపొస్తున్నారు. మరి పిల్లల భవిష్యత్తు బంగారము కావాలంటే, ఇంగ్లీషు రావాలి. ఇంగ్లీషు నూరిపోయటములో తప్పులేదుకాని, తెలుగుని పారవేయటములోనే ముప్పుంది!

దీనికి తోడు యువకులంతా తమ తమ ఊళ్ళొదిలి పొలోమని పట్టణాలకి పరిగెడుతున్నారు– జీవనాధారము కోసము. హైదరాబాదు వంటి నగరాల్లో తెలుగులో మాట్లాడితే కుక్క కూడ పలకదు! స్థానికంగా అభివృద్ధి జరిగితే కాని ఈ వలసను అరికట్టలేము. తెలుగులో సాంకేతిక శాస్త్రీయ చదువు కూడా చులకనే. తెలుగు భాషలో, తెలుగు వారు కొత్త విషయాలు కనిపెట్టి, ప్రపంచానికి కొత్త మార్గాలు కొత్త

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org

కానుకలు ఇవ్వాలంటే, ముందు మనము తెలుగులో మాట్లాడటము నేర్చుకోవాలి.

మరి దీనికి మందేమిటి, మార్గమేమిటి? ద్విభాష సూత్రము! మన సంస్కృతి రక్షణకి ఇదే సరయిన తారకమంత్రము. ఇది మనకే కాదు, ప్రస్తుత ప్రపంచములో ఏ భాష/సంస్కృతి బతికి బట్టకట్టాలన్నా, ఇదే తారకమంత్రము, ద్విభాషా సూత్రమే మార్గము.

ద్విభాష అనేది దానంతట అది రాదు. మనము కష్టపడి నేర్చుకుంటేనే వస్తుంది. ఇక్కడ మనము గుర్తించాల్సిన విషయమేమిటంటే, ద్విభాష అంటే రెండు భాషలను కలిపేసి మాట్లాడటము కాదు. ఒక వాక్యము తెలుగులో, రెండో వాక్యము ఇంగ్లీషులో మాట్లాడితే, ఒక వాక్యములో అక్కడక్కడ తెలుగు పదాలు వాడితే ద్విభాష కాదు. అట్లా కలిపేస్తే, అది తెంగ్లిషు అవుతుంది. అది ఒక సరికొత్త ఇంగ్లిషుసంస్కృతి, మన సంస్కృతిని నాశనము చేసే రోగము. ప్రస్తుతము తెలుగు ప్రజలకు అది చాలా నచ్చింది ఎందుకంటే, ఎక్కువ కష్టపడవలసిన పని లేదు.

ఒక భాష లోనించి ఇంకొక భాషలోకి గెంతకుండ మాట్లాడగలగటము ద్విభాష. అంటే రెండు భాషలలోనూ తడుముకోకుండ, కలపకుండ, అనర్గళంగా మాట్లాడటము, ఉపయోగించటము. అంటే ఇంగ్లిషుని అనర్గళంగా తెలుగు రాని వారి సమక్ష్యములో, తెలుగుని తెలుగుఆరి సమక్షంలో; తెలుగులో మాట్లాడుతున్నప్పుడు, తెలుగు పదాలనే వాడుతూ, ఇంగీషు ఆసరా లేకుండ మాట్లాడటము, అలాగే ఇంగ్లీషులో మాట్లాడుతున్నప్పుడు, ఆ భాష సాంప్రదాయము, వ్యాకరణములను అనుసరించి, ఇంగ్లీషు సంభాషణ కొనసాగించ గలగడము ద్విభాష. ఆవిధంగా ద్విభాషా సూత్రాన్ని పాటించినపుడు మాత్రమే మనము మన భాషను సంరక్షించగలుగుతాము.

చిన్నపిల్లలు చాల సులభంగా భాషలను నేర్చుకుంటారు. వారి గ్రహణశక్తి అద్భుతము. పిల్లలు తల్లి కడుపులో ఉన్నప్పుడే ఈ గ్రహణశక్తి మొదలవుతుందని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. మహాభారతములో అభిమన్యుడు తల్లి గర్భములో ఉన్నప్పుడే పద్మవ్యూహమును చేధించటము నేర్చుకున్నాడు కదా! చిన్న పిల్లలకి చాల సులభంగా రెండు మూడు భాషలు నేర్పవచ్చు. తల్లిదండ్రులు కష్టపడి నేర్పితే, వారికి నాలుగయిదేళ్ళు

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

వచ్చేటప్పటికి, పిల్లలు చక్కగా అనర్గళంగా రెండు మూడు భాషలు మాట్లాడగలుగుతారు.

తెలుగుతల్లులు తెలుగు భాషకు ప్రాధాన్యతనివ్వాలి. ఇవ్వాళరేపు డబ్బులేని పేద వారు కూడా తమ పిల్లలని ఇంగ్లీషు మాధ్యమమున్న బడులకు పంపిస్తున్నారు. ఆందుకని తల్లి దండ్రులు, ఇంటిదగ్గర తెలుగుకి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి. ముఖ్యంగా తల్లి పిల్లలకు తెలుగును ఉగ్గుపాలతో నేర్పాలి. ప్రస్తుత కాలములో తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయటమే కాకుండ, ఈ పోటీ యుగములో నెగ్గే విధంగా పిల్లలని తయారు చేయ్యాలి. బడిలో, పంతుళ్ళు, పంతులమ్మల మీద పూర్తిగా చదువు నేర్పే బాధ్యతను వదిలివేయకూడదు. తల్లిదండ్రులు ప్రతి రోజు కొంత సమయము పిల్లలకు చదవటము, చదివించటము పిల్లలకి ఒకటి–రెండేళ్ళ వయసునుండే మొదలు పెట్టాలి. ప్రత్యేక తరగతులు పాఠాలు అందరికి అందుబాటులో ఉండవుకదా. మామూలు మధ్యతరగతి, నిమ్నతరగతుల వారికి, ఇది ఆర్థికముగా అస్సలు సాధ్యము కాకపోవచ్చు. కాబట్టి పిల్లలను ఈ పోటీ యుగములో బతికగలిగేటట్టు పెంచాలంటే, తల్లిదండ్రులు చాలా కష్టపడవలసి ఉంది. ఇది కష్టమే, ప్రత్యేకంగా మధ్య–నిమ్నతరగతుల వారికి. కాని తప్పదు– మన భాషాసంస్కృతులు బతికుండాలంటే! మన భాషగురించి మనము పట్టించుకోకపోతే, ఇంకెవరు పట్టించుకొంటారు?

ద్విభాష విషయంలో కొన్ని అపోహలు భారతీయులలో ఉన్నాయి. రెండు భాషలు ఒకే సారి నేర్పితే పిల్లలు గందరగోళ పడతారని చాలా మందికి భయము. కాని చిన్నపిల్లలు చాలా సులభంగా, తైత్తిరీయ పక్షుల వలె, రెండుమూడు భాషలను నేర్చుకోగలరని శాస్త్రవేత్తలు ఉద్ఘాటిస్తున్నారు. ఎంత పిన్న వయసులో రెండు భాషలు నేర్పితే, భాష ఉచ్చారణ ఇబ్బందులు పదాల గందరగోళము అంత తక్కువ అని శస్త్రవేత్తల ఉవాచ.

మరి రెండు భాషలు ఒకేసారి ఎలా నేర్పాలి? ఈవ్వాళ రేపు చంటిపిల్లలను బాలవిహార్లకి పంపించుతున్నాముకదా. ఇంగ్లీషు మాధ్యమము కల బడులకు పంపించుతున్నాము కద! ఇక తల్లిదండ్రులు తెలుగుని ఇంటిలో నేర్పాలి. అంటే, ఇంగ్లీషుని బడిలో, తెలుగుని ఇంటిలో. ఒక వేళ పిల్లలని బాలవిహార్లకి పంపించకపోతె, తల్లిదండ్రులు చెరొక భాషను ఎన్నుకొని, తూచ తప్పకుండ ఆ భాషలో పిల్లలతో ఎల్లప్పుడు మాట్లాడాలి, నేర్పాలి. ఉదాహరణకు, తల్లి మాతృభాష, తండ్రి ఇంగ్లీషు ఎన్నుకోవచ్చు. ఈ పై రెండు పద్ధతులలో ఏది ఎన్నుకున్నా, పిల్లలకి నాలుగు–అయిదు ఏళ్ళు వచ్చేటప్పటికి అనర్గళంగా రెండు భాషలలో, కలపకుండా, మాట్లాడే శక్తి వస్తుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఆయితే పిల్లలు పెద్దవాళ్ళ వలెనే,

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

బద్ధకముతో భాషలను కలిపేసి వాడే అవకాశము చాలా ఉంది. తల్లిదండ్రులు పట్టుదలగా ఆ తెంగ్లిషుని అరికట్టాలి.

ఆంధ్రప్రదేశ ప్రభుత్వము త్రిభాష సూత్రాన్ని అమలు పరుస్తున్నది. కాని బడిలో నాలుగవ తరగతిలోనొ, లేక ఐదవ తరగతిలోనొ ఇంగ్లీషు, హిందీ నేర్పటము మొదలు పెడతారు. ఇంకా చిన్న వయసులో మొదలు పెడితే ప్రయోజనము ఎక్కువ ఉంటుంది. అయితే మూడవ భాష వలన ప్రయోజనము కన్నా నష్టమే ఎక్కువ! ఎవరయిన మూడు నాలుగు భాషలు నేర్చుకోదలుచుకుంటే, వారికి అవకాశాలుండాలి కాని, అందరి నెత్తిన మూడు భాషలు రుద్దటము మూలంగా, ఇప్పుడున్న తెంగ్లీషు పరిస్థితి ఏర్పడుతున్నది. పైగా ఈ మూడు భాషల్లో హిందీ, ఇంగ్లీషు తప్పనిసరి, కాని తెలుగు తప్పనిసరి కాదు. దీనివలన తెలుగుపై గౌరవము, దాని అవసరము ప్రజలకుండదు.

సంస్కృతిని నాశనము చేయాలంటే త్రిభాష కంటే మించిన హింసలేని మార్గము ఇంకొకటి లేదు. తెలుగు దానంతట అదే చచ్చిపోతుంది. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి వెళ్తానన్నట్టు, రెండు భాషలను సక్రమంగా నేర్చుకోలేని మనకు, మూడు భాషలెందుకు? తెలుగూ, ఇంగ్లీషు క్షుణ్ణంగా నేర్చుకుంటే, అక్కడికదే గొప్ప. మాతృభాషనొదిలిపెట్టి పరాయి భాషలు పది నేర్చుకుంటే– ప్రపంచము నవ్వటమేకాదు, మన సంస్కృతి నాశనము కావటము తధ్యము.

తెలుగులో ఇంగ్లీషు పదాలులేకుండ మాట్లాడితే చులకనవుతామనే భయాన్ని మనము వదిలి పెట్టాలి. తెలుగులో ఇంగ్లీషు పదాలు అనవసరముగా వాడటమే సిగ్గుచేటు అని గుర్తించాలి మనమంతా. తెలుగులో ఇంగ్లీషు పదాలు, వాక్యాలు లేకుండా మాట్లాడిన వారిని చదువురానివారికింద జమకట్టటము, చులకన చెయ్యటము మానెయ్యాలి. అయితే కంప్యూటరు, టెలిఫోను, కారు వంటి పదాలని తెలుగులోకి అనువాదము చెయ్యవలిసిన పనిలేదు కాని; డాడీ, మమ్మీ, కర్రీ, రైసూ వంటి పదాలను వాడవలసిన దుస్థితిలో తెలుగు భాష లేదుకదా. తెలుగులో శాస్త్ర, సాంకేతిక విద్య– విశ్వవిద్యాలయ స్థాయి వరకు లభ్యమయ్యేటట్లు చేయాలి. తెలుగులో శాస్త్ర, సాంకేతిక పత్రికల ప్రచురణ జరగాలి. దీనికి మనము కృషి చేయాలి.

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.

http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

తెలుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాష. ఆయినప్పటికీ తెలుగు ప్రజల అవసరాలు తీర్చే రాష్ట్ర, కేంద్ర కార్యాలయాల్లో, సంస్థల్లో, తెలుగుకంటే– ఇంగ్లీషు, హిందీలకే ప్రాధాన్యత, చలామణి ఎక్కువ. ఇంగ్లీషులో అయితే ఏ కార్యాలయములో అయినా పనులు సులభంగా అవుతాయి. తెలుగు వారికి తప్పులతడికెల ఇంగ్లీషులో ఉత్తరప్రత్యుత్తరాలు జరపటమంటే చాల గొప్ప. తెలుగుదేశ రాజధానిలో తెలుగులో మాట్లాడితే పనులు జరగవు. తెలుగులో మాట్లాడితే, ఉత్తరాలు, దరఖాస్తులు రాస్తే సిగ్గుచేటు. నైజాం ప్రభుత్వానికి, బ్రిటిషు ప్రభుత్వానికి, ప్రస్తుతమున్న ప్రజాతంత్ర ప్రజాస్వామ్యానికి ఈ విషయములో పెద్ద తేడా లేదు. దీనికంతటికి కారణము మనమే, ఎందుకంటే మనమే కద ప్రభుత్వాన్ని ఎన్నుకునేది.

మనము తెలుగు నేర్చుకోవటమే కాదు, ఇతరులకు కూడా నేర్పవలసిన అవసరము ఎంతైనా ఉంది. ఆంధ్రప్రదేశానికి వచ్చిన వారికీ, తెలుగు నేర్చుకోదలుచుకున్నవారికీ– తెలుగు నేర్చుకోవటానికి సరయిన వనరులు లేవు. ఇతరులు నేర్చునేందుకు అవసరము, ఆవశ్యకత, అవకాశాలు కల్పించవలసిన బాధ్యత కూడా మనదే. అందుకోసము తెలుగువాచకాలు అన్ని స్థాయిలలో వారికోసమూ, ఇతర జాతుల వారికోసమూ, ఇరుగుపొరుగు రాష్ట్రాల వారికోసము, పరదేశీయుల కోసమూ తయారుచేయాల్సిన అవసరము చాలా ఉంది. ఈ విషయములో యూరోపియన్లు చాలా ముందున్నారు. ఉదాహరణకి– రష్యాకు కాని, జర్మనీకి కాని చదువురీత్యా, వృత్తి రీత్యా ఎవరయినా వెళితే– వాళ్ళు మొట్టమొదట నేర్చుకునేది అయా రాష్ట్రాల భాషలు. ఆంధ్రప్రదేశ్ లో అటువంటి ఏర్పాటు అవకాశము లేనే లేదు. ఈ అవకాశాన్ని మనరాష్ట్రానికి వచ్చిన తెలుగురాని ప్రతివారికి ఆంధ్రప్రదేశ ప్రభుత్వము, భారత ప్రభుత్వము కల్పించాల్సిన అవసరము చాలా ఉంది.

దీనికోసము వనరులను తయారుచేయాలి. స్పానిషు, జర్మను, రష్యను వంటి భాషావాచకాలు, టేపులను, సీడీలు, వీడియోలను పరిశీలించి, అనుసరించి, ఉపయోగించి తెలుగులో ఆయా విషయాలను తయారుచేయవచ్చు. ఈ వస్తువుల ధరలు అందరికి అందుబాటులో ఉండేవిధంగా తయారుచేస్తే, ఇదే ఒక పెద్ద వ్యాపారంగా మార్చవచ్చు. అదేవిధంగా, యూరోపియను రాష్ట్రాలు ఏవిధంగా ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయో పరిశీలించి, మనము మనకనుగుణంగా మార్చుకొని అనుసరించవచ్చు.

ఆయితే ప్రజాతంత్ర వ్యవస్థలో ప్రజలందరూ ఏది కావాలనుకుంటే అది జరగాలి. ప్రస్తుతము

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org

శ్రీ వేపచేదు విద్యా పీఠము

Vepachedu Educational Foundation, Inc.

మన సంస్కృతి

Mana Sanskriti

తెలుగుదేశములో, భారతదేశములో జరుగుతున్నవన్నీ ప్రజల కోరిక ప్రకారమే జరుగుతున్నాయని చెప్పలేము. కానీ ప్రజలు విషయాలను తెలుసుకొని, తమ సంస్కృతి సంరక్షణార్థము, బాధ్యతలను ఎందుకూ కొరగాని ప్రభుత్వము చేతులోనుంచి పజల చేతుల్లోకి తీసుకోవలసిన సమయము వచ్చింది. తెలుగు ప్రజలు ఈ విషయాన్ని గ్రహించిన నాడే, మన సంస్కృతి పునరుజ్జీవనము జరుగుతుంది.

ఇంగ్లీషు మూలము: **"Bilingualism, A Sacred Mantra to Save Endangered Cultures," Mana Sanskriti, issue 84, 5106 Kali Era, taarana Year, maargasira month (http://www.vedah.net/manasanskriti/bilngualism.html).**

*** * ***

Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.
http://www.vepachedu.org